క్లుప్తంగా

వేణుగోపాలస్వామికి విశేష పూజలు

కపిలేశ్వరపురం: మండల పరిధి అంగరలోని రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాల స్వామి దివ్య కల్యాణోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామికి విశేష పూజలు చేశారు. ప్రధాన అర్చకుడు పెద్దింటి వెంకటలక్ష్మీ నరసింహాచార్యులు పర్యవేక్షణలోని ప్రసన్నకుమార్ భార్గవ్, మురళీకృష్ణమాచార్యులు స్వామికి విశేషార్చనలు చేశారు. పూర్ణాహుతి, దీక్షా విసర్జన, ధ్వజ అవరోహణం తదితర పూజలతో పాటు గ్రామంలోని ఖణ్వనది వద్ద చక్రస్నానం చేయించారు. అనంతరం అంగర, పడమర ఖండ్రిక గ్రామాల్లో నిర్వహించిన దేవతామూర్తుల వాహన ఊరేగింపు ఉత్సాహభరితంగా సాగింది. ఉత్సవ నిర్వహణ కమిటీ చైర్మన్ ముత్తా అబ్బు, అంగర పడమర ఖండ్రిక గ్రామాల భక్తులు, ప్రజాప్రతినిధులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మహాలక్ష్మి అమ్మవారికి పంచామృతాభిషేకం

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట పట్టణం బురుగుంట చెరువు సమీపంలోని సీతారామ క్షేత్రంలో వేంచేసియున్న మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో ఆదివారం పంచామృతాభిషేకం, పూజలు నిర్వహించారు. లక్ష్మీదేవి జయంతి సందర్భంగా అమ్మవారికి అయినవిల్లి శివానంద ప్రసాద్ ఆధ్వర్యంలో మల్లిపూడి గణేష్, మల్లిపూడి వెంకటేశ్వరరావు, పసల శ్రీనివాస్ దంపతుల పర్యవేక్షణలో పూజలు నిర్వహించారు. అమ్మవారికి కుంకుమార్చన పూజలు చేశారు.

రహదారి అభివృద్ధి పనుల ప్రారంభం



రాయవరం-లొల్ల ఆర్అండ్‌బీ రహదారి మరమ్మతులు చేస్తున్న దృశ్యం

రాయవరం: రాయవరం-లొల్ల ఆర్అండ్‌బీ రహదారి అభివృద్ధి పనులను ఆదివారం ప్రారంభించారు. 2.5 కి.మీ నిడివి ఉన్న రాయవరం-లొల్ల ఆర్అండ్‌బీ రహదారి అభివృద్ధికి రూ.60 లక్షలు మంజూరయ్యాయి. రహదారి అభివృద్ధి పనులపై ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వైభవంగా ధ్వజారోహణం



వెల్లలో స్వామివార్ల ధ్వజారోహణ ఊరేగింపు

రామచంద్రపురం రూరల్: వెల్లలోని బాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వరస్వామి, రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి, శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం సందర్భంగా ఆదివారం స్వామివార్ల ఊరేగింపు ఉత్సవం, ధ్వజారోహణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అర్చకులు చావలి సోమేశ్వరరావు, అంగర విజయ వెంకట సూర్యనారాయణాచార్యులు నేతృత్వంలో అర్చక బృందం స్వామివార్లకు పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం గరుడ వాహనాలపై స్వామివార్లకు ఊరేగింపు ఉత్సవాలను చేశారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

ఎరువుల షాపుల్లో తనిఖీలు



ఎరువుల షాపులో తనిఖీ చేస్తున్న అధికారులు

రామచంద్రపురం రూరల్: ఎన్నికల కోడ్ నేపథ్యంలో నిబంధనల మేరకు రామచంద్రపురం మండలంలోని ఎరువుల షాపులను ఆదివారం తనిఖీ చేసినట్లు మండల వ్యవసాయాధికారి ఎస్ సత్యప్రసాద్ తెలిపారు. ఎరువుల దుకాణాల్లోని బస్తాలపై ఉన్న పీఎం మోదీ ఫొటోలను కవర్లతో మూసివేశామన్నారు. వ్యవసాయ కమిషనర్ ఆదేశాల మేరకు ఎరువుల స్టాక్ రిజిస్టర్‌లో ముద్రించి, సంతకం చేశామన్నారు. ఎన్నికలు ముగిసే వరకూ ఎరువుల షాపుల యజమానులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశామన్నారు.

మిథున్‌రెడ్డి పర్యటన విజయవంతం చేయండి

రాజోలు: రాజోలు నియోజకవర్గంలో ఈ నెల 26న జరిగే ఉభయ గోదావరి జిల్లాల వైఎస్సార్ సీపీ కో–ఆర్డినేటర్, ఎంపీ మిథున్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని రాజోలు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన తాటిపాక మండల పార్టీ అధ్యక్షుడు కట్టా శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన రాజోలు మండల పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ప్రసంగించారు. చాకలిపాలెం బాలాజీ ఫంక్షన్ హాలులో ఈ నెల 26న పార్టీ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం జరుగుతుందన్నారు.

ప్రజల్లో విశ్వాసం పెంచిన జగన్

- గత పాలకుల వల్ల రాజకీయ నేతలకు చెడ్డ పేరు
- ఎంపీ పిల్లి సుభాష్‌చంద్ర బోస్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ బోస్

రామచంద్రపురం: ఎన్నికల్లో ఇచ్చిన మేనిఫెస్టోను కచ్చితంగా అమలు చేసి, ప్రజల్లో రాజకీయ నాయకులపై ఉన్న విశ్వాసాన్ని నిలబెట్టిన నేత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ పిల్లి సుభాష్‌చంద్రబోస్ అన్నారు. అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలను పక్కనపెట్టి, ప్రజలను నిలువునా ముంచిన గత పాలకుల మూలంగా.. ప్రజల్లో రాజకీయ నాయకులపై విశ్వాసం సన్నగిల్లిందని చెప్పారు. పట్టణంలోని ఒకటో వార్డు కొత్తూరులోని టిడ్కో గృహ సముదాయం వద్ద జరిగిన కార్యక్రమానికి ఎంపీ బోస్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీ బోస్ మాట్లాడుతూ, ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేనిఫెస్టోను పవిత్రంగా భావించి, ప్రజలకు అమలు చేసిన ప్రభుత్వం దేశంలోనే మన రాష్ట్రం మాత్రమేనన్నారు. గత పరిస్థితులకు భిన్నంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేసి వైఎస్సార్ సీపీపైనా, రాజకీయ నేతలపై విశ్వాసాన్ని పెంపొందించారన్నారు. పేదరిక నిర్మూలనే లక్ష్యంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తూ, తండ్రిని మించిన తనయుడిగా ఆయన నిరూపించుకున్నారని అన్నారు. తాను చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందితేనే తనను తిరిగి ఆశీర్వదించాలని కోరుతున్న.. దమ్మున్న నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని చెప్పారు. గత ప్రభుత్వాలు ఎన్నికల్లో ప్రజలను మభ్యపెట్టే విధంగా హామీలను గుమ్మరించి, అధికారం వచ్చాక మోసం చేస్తే, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే పేదల పక్షాన నిలిచి, వారి అవసరాలను తీర్చిన ముఖ్యమంత్రిగా మన్ననలు పొందారన్నారు. పేదలకు అందుతున్న పథకాలు తిరిగి యథావిధిగా కొనసాగాలంటే, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తిరిగి ముఖ్యమంత్రి కావాల్సిన చారిత్రక అవసరం ఎంతైనా ఉందన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్లు చింతపల్లి నాగేశ్వరరావు, కోలమూరి శివాజీ, కౌన్సిలర్లు కేతా శ్రీను, బాసిన నాగమణి, కేతా సుజాత, బొక్కా సత్యనారాయణ, కట్టా శ్రీరాములు, కోటిపల్లి శివాజీ, కో ఆప్షన్ సభ్యులు గుబ్బల గణ, ఎంఎస్‌కే మస్తాన్, పార్టీ పట్టణ కన్వీనర్ గాదంశెట్టి శ్రీధర్, మాజీ కౌన్సిలర్ చింతపలి వెంకట్రావు, పార్టీ నేతలు గుణ్ణం రామకృష్ణ, గుణ్ణం సూరిబాబు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ధనమ్మ మర్రికి భక్తుల తాకిడి

కపిలేశ్వరపురం: కేదారిలంక గ్రామ శివారు వీధివారిలంకలోని ధనమ్మ మర్రి క్షేత్రాన్ని ఆదివారం పెద్ద సంఖ్యలో భక్తులు సందర్శించారు. ఆధ్యాత్మికంగా, పర్యాటకంగా ప్రజలను ఆకట్టుకునే ధనమ్మ మర్రి ప్రాంతంలో సందర్శకులు సందడి చేశారు. ఆడపడుచులు ధనమ్మ తల్లికి మొక్కులు తీర్చుకున్నారు. సెలవు దినం కావడంతో కపిలేశ్వరపురం మండలంతోపాటు కొత్తపేట, అయినవిల్లి, రామచంద్రపురం, పి.గన్నవరం తదితర ప్రాంతాల నుంచి భక్తులు ధనమ్మ మర్రిని సందర్శించారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

కాజులూరు: ద్వారపూడి–యానాం రహదారిలో కాజులూరు మండలం కుయ్యేరు వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికుల వివరాల మేరకు, యానాంకు చెందిన రాయవరపు చంద్రరావు తన బైక్‌పై ద్రాక్షారామ వెళుతున్నాడు. కుయ్యేరు వద్దకు వచ్చేసరికి పాదచారుడు అడ్డురావటంతో సడన్ బ్రేక్ వేశాడు. అదుపుతప్పిన బైక్ పల్టీలు కొట్టడంతో చంద్రరావు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతడిని యానాం ఆస్పత్రికి తరలించారు.

ప్రజాసేవ వైఎస్సార్ సీపీతోనే సాధ్యం



పడమర ఖండ్రికలో పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- వైఎస్సార్ సీపీలో చేరిన వంద మంది జనసేన కార్యకర్తలు

కపిలేశ్వరపురం: పేద, మధ్య తరగతి ప్రజలకు సేవచేయాలన్న ఆశయం ఉన్నవారికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ ఓ అద్భుతమైన వేదిక అని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. మండలంలోని పడమర ఖండ్రికలో ఆదివారం అంగర, పడమర ఖండ్రిక గ్రామాల్లోని జనసేన పార్టీకి చెందిన వంగా కనక శ్రీను, తోరాటి రఘు, కవల కొండబాబు, చిక్కాల రాము తదితర 100 మంది వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్సీ తోట పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిని జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ పరిశీలకులు డాక్టర్ చల్లా ప్రభాకరరావు, యువనేత తోట పృథ్వీరాజ్, ఇరు గ్రామాల సర్పంచ్‌లు వాసా కోటేశ్వరరావు, తిరునాతి ఆదిలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు అడ్డాల శ్రీనివాస్, మేడిశెట్టి దుర్గారావు, పార్టీ గ్రామ కమిటీల అధ్యక్షుడు కవల శ్రీను, పీఏసీఎస్ చైర్మన్ గంగుమళ్ళ రాంబాబు, జిల్లా వైద్యుల విభాగం అధ్యక్షుడు చోడే సత్యకృష్ణ, విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి చోడే శ్రీకృష్ణ మాజీ సర్పంచ్ వంగా శ్రీనివాస్ తదితర నాయకులు అభినందించారు. ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ రాజకీయాల్లో కొనసాగే వారికి ప్రజల నుంచి వస్తున్న ప్రశంసలు సంతోషాన్నిస్తాయని, ప్రజల ఆశీర్వాదాలు వారికంటూ ఏదైనా సేవ చేసినప్పుడు అందుతాయన్నారు. ఆ అవకాశం వైఎస్సార్ సీపీలో పుష్కలంగా ఉందన్నారు. అన్ని వర్గాల ప్రజలకు వివిధ పథకాలతో ప్రభుత్వ లబ్ధిని అందిస్తున్న చరిత్ర వైఎస్సార్ సీపీదే అన్నారు. పార్టీలో చేరిన వారిని కంటికి రెప్పలా కాపాడుకుంటానని ఎమ్మెల్సీ తోట అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ అనుబంధ విభాగాల జిల్లా నాయకులు పసలపూడి శ్రీనివాస్, మండల బూత్ కమిటీల ఇన్‌చార్జి సలాది వీరబాబు, సిరిపురపు శ్రీనివాస్, యర్రా వీరన్న, వంగా శ్రీనివాస్, కవల రాజు, వాసంశెట్టి వాసు తదితరులు పాల్గొన్నారు.

దండు మారెమ్మా.. వందనాలమ్మా

వైభవంగా అమ్మవారి జాతర



జాతర సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు



దండు మారెమ్మకు ప్రత్యేక అలంకరణ

రాయవరం: భక్తుల కొంగు బంగారంగా పూజలందుకుంటున్న వెంటూరు గ్రామ దేవత దండు మారెమ్మ జాతర వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ నెల 12వ తేదీ నుంచి జాతర, తీర్థం నిర్వహిస్తున్నారు. జాతరలో భాగంగా శనివారం రాత్రి అమ్మవారి అంత్య జాతర నిర్వహించారు. జాతర సందర్భంగా ఉత్సవ కమిటీ ఏర్పాటు చేసిన గారడీలు, గరగ నృత్యాలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. ఆదివారం ఉదయం నుంచి అమ్మవారి తీర్థం ఘనంగా నిర్వహించారు. పాడి పంటలను, పిల్లా పాపలను, పసుపుకుంకాలను చల్లగా చూడాలని కోరుతూ మహిళలు అమ్మవారికి నైవేద్యాలు, చీరలు, రవికెలు, పసుపు కుంకాలను సమర్పించారు. అమ్మవారిని వివిధ రకాల ఆభరణాలు, పూలతో నయనానందకరంగా అలంకరించారు. అనపర్తి సీఐ కె.శ్రీధర్‌కుమార్, రాయవరం ఎస్సై జి.నరేష్ శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా బందోబస్తు నిర్వహించారు. సర్పంచ్ వాసంశెట్టి వెంకట్రావు, ఉప సర్పంచ్ నున్న కృష్ణప్రదీప్, వైస్ ఎంపీపీ గుబ్బల సుబ్రహ్మణ్యం, ఎంపీటీసీ వాసంశెట్టి విజయకుమార్, మాజీ సర్పంచ్‌లు రిమ్మలపూడి వేణుగోపాలదొర, వాసంశెట్టి రాధాకృష్ణ తదితరులు అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు.

ప్రశాంత ఎన్నికలకు ప్రజలు సహకరించాలి



రాయవరంలో ఓటు హక్కు వినియోగంపై మాట్లాడుతున్న డీఎస్పీ రామకృష్ణ

రాయవరం: త్వరలో నిర్వహించనున్న సాధారణ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని రామచంద్రపురం డీఎస్పీ రామకృష్ణ పిలుపునిచ్చారు. రాయవరంలో ఆదివారం ఆయన సాధారణ ఎన్నికలు–2024పై అవగాహన సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో పవిత్రమైనదని, ఓటు హక్కును సక్రమంగా, సమర్థవంతంగా, నిజాయతీగా వినియోగించుకున్నప్పుడే ప్రజాస్వామ్యం బలోపేతమవుతుందన్నారు. ఎన్నికలకు ఎటువంటి విఘాతం కలగకుండా ఉండేందుకు ప్రజలు సహకరించాలన్నారు. ఎన్నికల సమయంలో ఎటువంటి కేసుల్లోను ఇరుక్కుని, భవిష్యత్తును పాడుచేసుకోవద్దన్నారు. ప్రతి పోలింగ్ స్టేషన్ వద్ద ఓటర్లు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకునే పరిస్థితులను ఎన్నికల కమిషన్ కల్పిస్తోందన్నారు. సమావేశంలో మండపేట రూరల్ సీఐ కె.శ్రీధర్‌కుమార్, తహసీల్దారు ఆర్‌వీ కృష్ణారావు, ఎస్సై జి.నరేష్ మాట్లాడారు. సమావేశంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించం

శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిని ఉపేక్షించేది లేదని మండపేట రూరల్ సీఐ కె.శ్రీధర్‌కుమార్, రాయవరం ఎస్సై జి.నరేష్ హెచ్చరించారు. రాయవరం, వెదురుపాక గ్రామాల్లో ఆదివారం ఎన్నికల విధుల నిమిత్తం వచ్చిన స్పెషల్ పార్టీ పోలీసులతో కలిసి కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీధర్‌కుమార్, ఎస్సై నరేష్ మాట్లాడుతూ మే 13న నిర్వహించనున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు చర్యల్లో భాగంగా కవాతు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే సమస్యాత్మక, అతిసమస్యాత్మక గ్రామాలను గుర్తించి, అల్లరి మూకలపై నిఘా ఉంచామన్నారు. అల్లర్లు, గొడవలు జరగకుండా ముందు జాగ్రత్తగా కవాతును నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కవాతులో స్పెషల్ పార్టీ పోలీసులు పాల్గొన్నారు.

క్షయవ్యాధిపై అవగాహన ర్యాలీ



కుందూరులో అవగాహన ర్యాలీలో పాల్గొన్న వైద్య సిబ్బంది



అంగరలో ర్యాలీలో పాల్గొన్న డాక్టర్ రత్నకుమారి వైద్య ఆరోగ్య కార్యకర్తలు



మాచవరం పీహెచ్‌సీ వద్ద క్షయ వ్యాధి నివారణ ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది

కపిలేశ్వరపురం: మండలంలోని అంగర పీహెచ్‌సీ వైద్యాధికారి పి.రత్నకుమారి ఆధ్వర్యంలో ఆదివారం ప్రపంచ క్షయవ్యాధి నిర్మూలన దినోత్సవాన్ని నిర్వహించారు. పీహెచ్‌సీ నుంచి అంగర, పడమర ఖండ్రిక గ్రామాల్లోని వీధుల్లో అవగాహన ర్యాలీని నిర్వహించారు. వైద్యాధికారి రత్నకుమారి మాట్లాడుతూ వ్యాధి కారణాలు, లక్షణాలు, నివారణ మార్గాలపై అవగాహన ఉంటే ప్రజారోగ్యాన్ని కాపాడుకోగలమన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ జిత్తుక మల్లికార్జునుడు, హెచ్ఈ బి.రామారావు, ఎంపీహెచ్ఎస్ తాతపూడి మేరీ, వైద్య ఆరోగ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

క్షయ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

రాయవరం: క్షయ వ్యాధి సోకిన వారికి ప్రభుత్వాసుపత్రుల్లో మెరుగైన చికిత్సలు అందుబాటులో ఉన్నాయని వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పేర్కొన్నారు. క్షయ రహిత సమాజం అందరి బాధ్యత అంటూ ఆదివారం రాయవరం, మాచవరం పీహెచ్‌సీల పరిధిలో జాతీయ క్షయ వ్యాధి నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఆస్పత్రి వద్ద నుంచి వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ చేపట్టారు. రాయవరం, మాచవరం పీహెచ్‌సీ సిబ్బంది, టీబీ విభాగం సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

క్షయ నిర్మూలన అందరి బాధ్యత

కె.గంగవరం: క్షయ వ్యాధిని అరికట్టాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని కుందూరు పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ రత్నసుధ, ఎన్‌వీ ప్రతాప్ అన్నారు. మండలంలోని కుందూరు, దంగేరు, పేకేరు, పామర్రు పీహెచ్‌సీల వద్ద ఆదివారం క్షయ వ్యాధి నివారణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీలు నిర్వహించారు. కుందూరులో వైద్యులు మాట్లాడుతూ క్షయ వ్యాధి ఉన్న వారు క్రమం తప్పకుండా మందులు వాడితే నయం అవుతుందన్నారు. వ్యాధి నిర్ధారణ అయితే చికిత్స పూర్తయ్యే వరకు మందులు ఉచితంగా అందించడంతో పాటు, పౌష్టికాహారం కోసం నెలకు రూ.500 చొప్పున ఆరు నెలలకు రూ.6 వేలను ప్రభుత్వం అందిస్తుందన్నారు. దేశంలో 2025 నాటికి క్షయ వ్యాధిని నిర్మూలించాలని ప్రభుత్వ లక్ష్యం విజయవంతమయ్యే వరకూ ప్రతిఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని కోరారు. అనంతరం మానవహారాలు నిర్వహించి, ప్రతిజ్ఞ చేశారు. అవగాహన కరపత్రాలను పంపిణీ చేశారు. టీబీ సూపర్‌వైజర్ కేఎస్‌వీ రమణ, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, పాల్గొన్నారు.

వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

కాజులూరు: వ్యాధులతో ప్రజలు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని గొల్లపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్ సౌజన్య అన్నారు. ఆదివారం ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా దుగ్గుదుర్రు, గొల్లపాలెం పీహెచ్‌సీల్లో వైద్యారోగ్య సిబ్బంది, ఆశా వలంటీర్లు గ్రామవీధుల్లో ర్యాలీలు నిర్వహించారు. క్షయ వ్యాధి సోకేందుకు అవకాశాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. డాక్టర్ సౌజన్య మాట్లాడుతూ పరిసరాల శుభ్రత, ఆహార నియమాలతో ప్రజలు వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవచ్చన్నారు. దగ్గు, జ్వరం వేధించడంతోపాటు, బరువు తగ్గితే క్షయ వ్యాధిగా అనుమానించి, సమీప పీహెచ్‌సీల్ల పరీక్షలు చేయించుకోవాలన్నారు. వ్యాధి నిర్ధారణ అయితే ప్రభుత్వమే ఉచితంగా చికిత్స అందిస్తుందన్నారు.

మండుతున్న ఎండలు

- రోజు రోజుకూ పెరుగుతున్న భానుడి ప్రతాపం
- అధిక ఉష్ణోగ్రతలకు అల్లాడుతున్న జనం
- వేసవిలో ప్రబలే వ్యాధులపై జాగ్రత్తలు అవసరం



ఎండ నుంచి రక్షణకు ముసుగు కప్పుకుని వెళ్తున్న కూలీలు

రాయవరం: భానుడు భగభగమంటూ నిప్పులు చెరుగుతున్నాడు. గ్రీష్మతాపం రోజు రోజుకూ అధికమవుతోంది. ఉదయం 10 గంటల నుంచే భానుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. ఉష్ణోగ్రతలు రోజు రోజుకు పెరగడం ప్రజలను భయాందోళనకు గురి చేస్తోంది. ఎండ తీవ్రతను చూసి జనం బయటకు వెళ్లేందుకు వెనకడుగు వేస్తున్నారు. ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. నాలుగు రోజుల క్రితం మబ్బులు కమ్ముకుని అక్కడక్కడ చిరుజల్లులు కురిసి వాతావరణం కాస్త చల్లబడినప్పటికీ మళ్లీ రెండు రోజులుగా ఎండలు మండిపోతున్నాయి. పగటి పూట ఉష్ణోగ్రతలు 38 డిగ్రీలకు చేరుకుంటున్నాయి. కనీస ఉష్ణోగ్రత 22 డిగ్రీలు ఉంటోంది. పెరుగుతున్న ఎండలను దృష్టిలో ఉంచుకుని ప్రజలు తగిన ఆరోగ్య రక్షణ సూత్రాలు పాటించాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా ఆహారం, నీటి విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. శరీరంలో తేమ (నీటి) శాతం ఉండాల్సిన దానికన్నా తగ్గకుండా చూసుకోవాలని సూచిస్తున్నారు.

వేసవిలో ప్రబలే వ్యాధులివే..

వేసవిలో సాధారణంగా అతిసార ఎక్కువగా ప్రబలుతుంది. ఎండలో తిరిగే వారు వడదెబ్బకు గురవుతుంటారు. అతిసారం సోకకుండా సురక్షితమైన నీటిని మాత్రమే కాచి చల్లార్చి వడబోసి తాగాలి. బావులు, బోర్లు, చెరువు, కాలువ నీళ్లు క్లోరినేషన్ తర్వాతనే వాటిని ఉపయోగించాలి.తాగునీటిని పరిశుభ్రమైతన పాత్రల్లో నిల్వ చేసి, వాటిపై మూతలు పెట్టాలి. వంట గదిలో ఆహార పదార్థాలపై కోసిన పండ్లు, కూరగాయ ముక్కలపై దుమ్ము, ధూళి, ఈగలు వాలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసర ప్రాంతాల పరిశుభ్రత పాటించాలి. వేడిగా, తాజాగా ఉన్న ఆహార పదార్థాలను మాత్రమే భుజించాలి. మరుగుదొడ్లను శుభ్రంగా ఉంచుకోవాలి. మల విసర్జన తర్వాత చేతులు శుభ్రంగా సబ్బుతో కడుక్కోవాలి. చెత్త చెదారాన్ని ఎత్తివేసి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి.

వడదెబ్బ లక్షణాలు..ప్రథమ చికిత్స

తలనొప్పి, తల తిరగడం, ఎండిపోయిన చర్మంతో ఎక్కువ జ్వరం కలిగి ఉండడం, మగత కలవరింతలు, ఫిట్స్, పాక్షిక లేదా అపస్మార స్థితిలోకి వెళ్లడం వంటి లక్షణాలను వడదెబ్బగా గుర్తించి వెంటనే ఆ వ్యక్తిని త్వరగా నీడ ఉన్న ప్రదేశానికి చేర్చాలి. వడదెబ్బ తగిలిన శరీరంపై ఉండే దుస్తులను తొలగించి, చల్లని నీటితో కడగాలి. ఐస్ ముక్కలను గుడ్డలో ఉంచి శరీరం అంతా తుడవాలి. శరీరం అంతా చల్లని గాలి తగిలేలా చూడాలి. బాధితులకు చల్లని నీరు లేదా ఉప్పు ఇతర లవణాలు కలిసిన నీటిని (ఓఆర్ఎస్ ద్రావణం) తాగించాలి.

చిన్నారులు ఎండలో తిరగకుండా చూడాలి



శరీరానికి గాలి తగిలే దుస్తులు వాడాలి. రోజుకు అవసరాన్ని బట్టి పెద్దలు ఆరు నుంచి ఎనిమిది లీటర్ల నీటిని తీసుకోవాలి. పిల్లలను ఎండలో ఆడకుండా చూడాలి. బయట ఆహారాన్ని తీసుకోకపోవడం మంచిది. పీహెచ్‌సీ పరిధిలో అవసరమైన ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయి.

– డాక్టర్ వి.అనిరుధ్, వైద్యాధికారి, పీహెచ్‌సీ, రాయవరం

అతిసారం లక్షణాలు కనిపిస్తే..

ఒకటి లేక నాలుగు సార్లు నీళ్లతో కూడిన విరేచనాలైతే ఆలస్యం చేయకుండా వెంటనే వైద్యుని సంప్రదించి చికిత్స పొందాలి. వాంతులు, నీళ్ల విరేచనాలు అవుతుంటే వెంటనే ఓఆర్ఎస్ ద్రావణాన్ని తాగించాలి. ఇంటిలో లభించే గంజి, పలుచని మజ్జిగ, పప్పు నీరు, కొబ్బరి నీళ్లు తాగించాలి. బిడ్డకు విరేచనాలైతే తల్లిపాలు బిడ్డకు ఇస్తూనే ఉండాలి.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి

సాధ్యమైనంత వరకు మధ్యాహ్నం ఎండలో తిరగకుండా జాగ్రత్తలు వహించాలి. తప్పనిసరిగా బయటకు వెళ్లాల్సి వస్తే ఉప్పు కలిపిన మజ్జిగ లేదా ఉప్పు కలిపిన పళ్ల రసాలు తాగి వెళ్లాలి. తెల్లని దుస్తులు ధరించాలి. నల్లని వస్త్రాలు వేడిని ఆకర్షిస్తాయి. వేసవిలో మద్యం సేవించడం వల్ల రక్తనాళాలు వ్యాకోచించి ఎక్కువ చెమట వచ్చేలా చేస్తాయి. అది విషయ పరిస్థితికి దారి తీస్తుంది. ఇంటి ఉష్ణోగ్రతలు తగ్గించేందుకు కిటికీలకు తలుపులకు తెరలను ఏర్పాటు చేయాలి. ఎండలో వెళ్లేటప్పుడు గొడుగు, టోపీలు, తలపాగా వంటివి ధరించాలి.

ఘనంగా వేంకటేశ్వరస్వామి రథోత్సవం

రావులపాలెం: వార్షిక నవాహ్నిక కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు ఆదివారం స్థానిక అలివేలు మంగా పద్మావతి అండాల్ సహిత వేంకటేశ్వర స్వామివారికి పుత్రకామేష్టి హోమం ఘనంగా నిర్వహించారు. తొలుతగా బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారికి ఉదయం సుప్రభాత సేవ, సహస్ర నామార్చనం నిర్వహించారు. అనంతరం స్వామివారిని ఉత్సవ మూర్తులను రథంపై ఉంచి గోవింద మాలధారులు పుర వీధుల్లో ఊరేగించారు. ప్రధాన అర్చకుడు వాడపల్లి కమలనాథ్ ఆచార్యులు ఆధ్వర్యంలో పూజలు చేశారు. రాత్రికి స్వామివారికి అశ్వ వాహనోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు.

కొత్తపూల ఉత్సవాలు ప్రారంభం



మోదుగుపూలతో అలంకరించిన గరగ

ఆలమూరు: చింతలూరులో ఉన్న నూకాంబిక అమ్మవారి జాతర, తీర్థ మహోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం రెండో అంకం ప్రారంభమైంది. స్థానిక ఆలయ ఆవరణలో కొత్తపూల ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. మన్యసీమ నుంచి తెచ్చిన మోదుగుపూలను అమ్మవారికి ప్రతిరూపమైన గరగకు అలంకరించారు. రోజు విడిచి రోజు కొత్తపూల ఉత్సవాలను ఏప్రిల్ ఆరు వరకూ నిర్వహిస్తారు.